నా కోసం వెతకొద్దు.. తనువు చాలిస్తున్నా..

● భర్తకు వీడియో కాల్ చేసిన భార్య ● రెండు రోజులుగా తీవ్రంగా గాలింపు.. ● నేటికీ దొరకని ఆచూకీ


ఉమారాణి (ఫైల్)

బాలానగర్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): 'నాకు క్యాన్సర్ ఉంది.. నేను కోలుకోలేను. మిమ్మల్ని ఇబ్బంది పెట్ట దలుచుకోలేదు. అందుకే నేను కాశీకి వెళ్లి తనువు చాలించాలని అనుకుంటున్నాను. నా కోసం వెతక కండి. బాబును స్కూలు వద్ద దింపి వెళుతున్నా..' అంటూ భర్తకు సమాచారం ఇచ్చి ఓ ఇల్లాలు అదృశ్యమైంది. ఈ ఘటన బాలానగర్ పోలీస్ స్టేషన్‌లో ఆలస్యంగా వెలుగుచూసింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం నాడే ఈ ఘటన చోటుచేసుకున్నప్పటికీ ఈ కేసుకు సంబంధించిన వివరాలను పోలీసులు గోప్యంగా ఉంచారు. వివరాలిలా ఉన్నాయి. బాలానగర్ పోలీస్‌స్టేషన్ పరిధి బాల్‌రెడ్డినగర్‌లో ధన్యాకుల రమేష్ బాబు, ఉమారాణి(40) దంపతులు నివసిస్తున్నారు. వీరికి కుమారుడు ఉన్నాడు. కొంత కాలంగా ఉమారాణి క్యాన్సర్‌తో బాధపడుతున్నది. చికిత్స చేయించుకుంటున్నా నయం కావడం లేదనే మనోవ్యధతో ఆవేదన చెందుతుండేది. అయితే, భర్తను కష్టపెట్టవద్దని అంతర్జాతీయ మహిళా దినోత్సవం (మార్చి 8న) రోజున నిర్ణయం తీసుకుంది. బాబును స్కూలుకు తీసుకెళ్తున్నానని భర్తకు చెప్పి సెల్‌ఫోన్‌తో వెళ్లింది. డ్యూటీకి ఆలస్యం అవుతుండడంతో ఇంటికి తాళం వేసి భర్త ఆఫీసుకు వెళ్లిపోయాడు. అయితే, మధ్యాహ్నం 12.47 గంటలకు భర్తకు వీడియో కాల్ చేసి 'నా అనారోగ్యం కారణంగా మిమ్మల్ని ఇబ్బంది పెట్టొద్దని నిర్ణయించుకున్నాను. నేను తనువు చాలించాలనుకుంటున్నాను. కాశీకి వెళుతున్నా.. నా కోసం వెతకొద్దు..' అంటూ 3 నిముషాలు మాట్లాడి సెల్ స్విచ్ ఆఫ్ చేసింది. ఆ వెంటనే గాలించినా ఆమె ఆచూకీ తెలియకపోవడంతో రమేష్‌బాబు బాలానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కాశీకి వెళ్లి వచ్చిన పోలీసులు

ఉమారాణి ఫోన్ నెట్‌వర్క్ ఆధారంగా బాలానగర్ పోలీసులు కాశీకి వెళ్లారు. అక్కడి పోలీసులతో కలిసి ఆమె కోసం వెతికినట్లు సమాచారం. అయితే, ఉమారాణి సెల్ నెట్‌వర్క్ చివరిసారిగా కాశీ చూపించినప్పటికీ ఎటువంటి అఘాయిత్యం చేసుకుని ఉండదని భావిస్తున్నారు. మరెక్కడికైనా వెళ్లిందేమోనని పోలీసులు అనుమానిస్తున్నారు.

సగం.. సగం.. పనులేనా ?

బాలాజీనగర్‌లో తొలగని చెత్తకుప్పలు


చెత్త తొలగించక ముందు నాటి ఫొటో

దుమ్ము, ధూళి, చెత్తకుప్పలు.. శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో సోమవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. వాటిని తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. అయితే.. సిబ్బంది సగం.. సగం పనులతో మమ అనిపించారు. చెత్తను, కొబ్బరి బొండాలను పూర్తిస్థాయిలో తొలగించలేదు. అందుకు ఈ చిత్రాలే నిదర్శనం. ఉన్నతాధికారులు ఆదేశాలు ఇచ్చారు కానీ క్షేత్రస్థాయిలో పర్యవేక్షించకపోవడంతో కాలనీలో పారిశుధ్య పనులు సజావుగా సాగడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. సగం సగం పనులను చూసి నవ్విపోతున్నారు.

- కేపీహెచ్‌బీ కాలనీ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి)


సగం తీసి వదిలేసిన చెత్త (తాజా ఫొటో)



సదస్సులో మాట్లాడుతున్న టీజీఎస్ ఆర్టీసీ ఎండీ వీసీ.సజ్జనార్

2026 నాటికి రూ.10 వేల కోట్ల టర్నోవర్

● టీజీఎస్ ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్

హైదరాబాద్ సిటీ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది 2026 నాటికి ఆర్టీసీ రూ. 10 వేల కోట్ల టర్నోవర్ చేరుకునే అవకాశముందని టీజీఎస్ ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ పేర్కొన్నారు. సోమవారం రెడ్‌హిల్స్‌లోని ఫెడరేషన్ హౌస్‌లో తెలంగాణ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఎఫ్‌టీసీసీఐ) ఆధ్వర్యంలో కార్పొరేట్ ఫెయిల్యూర్ అండ్ డిజిటల్ ఫ్రాడ్, విజయానికి మార్గాలపై సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న సజ్జనార్ మాట్లాడుతూ 2021 సెప్టెంబరులో ఆర్టీసీ ఎండీగా బాధ్యతలు స్వీకరించినప్పుడు కార్పొరేషన్ మొత్తం టర్నోవర్ రూ.3800 కోట్లు కాగా, నాలుగేళ్లలో దాన్ని భారీగా పెంచి ఇప్పుడు ఇది బిలియన్ డాలర్ల కంపెనీగా మార్చినట్లు తెలిపారు. ఆర్టీసీ సంస్థలో పనిచేస్తున్న 50 వేల మంది ఉద్యోగుల నిబద్ధత, దృఢ సంకల్పం, ప్రభుత్వ మద్దతుతో ఇది సాధ్యమైనదన్నారు. ప్రస్తుతం ఏఐ, బిగ్ డేటా పెరుగుదల డిజిటల్ మోసాల పరిధిని పెంచిందన్నారు. డిజిటల్ మోసాలు నిరోధించడానికి సైబర్ సెక్యూరిటీపై సిబ్బందికి శిక్షణ ఇవ్వడం చాలా ముఖ్యమన్నారు. కార్యక్రమంలో సైబర్ సెక్యూరిటీ సొల్యూషన్స్ వ్యవస్థాపకుడు సాయిరామ్ పాలబిందెల, ఎఫ్‌టీసీసీఐ ఉపాధ్యక్షుడు ఆర్.రవికుమార్, కె.మహేశ్వరి, ఆఫీస్ బేరర్లు పాల్గొన్నారు.

● సావిత్రీబాయి పూలేకు నివాళి



సావిత్రీబాయి పూలే వర్ధంతిని పురస్కరించుకొని సోమవారం కేపీహెచ్‌బీ ఐదోఫేజ్‌లోని జనసేన పార్టీ కార్యాలయంలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఆ పార్టీ కూకట్‌పల్లి ఇన్‌చార్జి ముమ్మారెడ్డి ప్రేమకుమార్ తదితరులు. - కేపీహెచ్‌బీకాలనీ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి)

● కాలేజీ భవన నిర్మాణానికి దాతలు ముందుకు రావాలి



కూకట్‌పల్లి న్యూ గవర్నమెంట్ కాలేజ్ భవన నిర్మాణానికి దాతలు ముందుకు రావాలని ప్రిన్సిపాల్ వెంకటయ్య కోరారు. ఈ మేరకు సోమవారం నిర్మాణ్ ఆర్గనైజేషన్ సీఈవోకు సీఎస్ఆర్ కింద భవనం నిర్మించేందుకు ముందుకు రావాలని వినతిపత్రం అందజేశారు. కళాశాలలో 1200 మంది చదువుకుంటున్నారని, రేకుల షెడ్డులో అరకొర వసతులతో నెట్టుకొస్తున్నారని పేర్కొన్నారు.

- కేపీహెచ్‌బీకాలనీ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి)

హెల్మెట్.. సీట్‌బెల్ట్ మస్ట్!

ఇంటర్వ్యూ...

మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు.. ఇబ్బందులు పడొద్దు..

● శివానంద పునరావాస కేంద్రం వద్ద సీసీ కెమెరాతో ప్రత్యేక నిఘా

● కూకట్‌పల్లి ట్రాఫిక్ సీఐ ముత్తుయాదవ్



కూకట్‌పల్లి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి బయటకు వచ్చే ద్విచక్ర వాహనాదారులు తప్పనిసరిగా హెల్మెట్.. కార్లలో ప్రయాణించేవారు సీటు బెల్టు పెట్టుకోవావాలని కూకట్‌పల్లి ట్రాఫిక్ సీఐ ముత్తు యాదవ్ 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని.. ఇచ్చి ఇబ్బందులు పడొద్దని తల్లిదండ్రులకు సూచించారు. ట్రాఫిక్ ఉల్లంఘనులపై ప్రత్యేక నిఘా పెట్టామని, అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

ప్రశ్న: రోజూ ట్రాఫిక్ ఉల్లంఘనల కేసులు ఎన్ని నమోదు చేస్తున్నారు?

జ: కూకట్‌పల్లి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జాతీయ రహదారి ఉండటంతో నిత్యం వేలాది వాహనాలు ఈ దారిలో ప్రయాణిస్తాయి. బాలానగర్ వైజంక్షన్ సమీపంలో, కైత్లపూర్ రోడ్డుతో పాటు శివానంద పునరావాస కేంద్ర వద్ద ఎక్కువగా ట్రాఫిక్ ఉల్లంఘనలు చోటుచేసుకుంటున్నాయి. రాంగ్‌పార్కింగ్, ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్, రాంగ్‌రూట్, డ్రైవింగ్‌లైసెన్స్ లేకుండా డ్రైవింగ్, హెల్మెట్, సీటుబెల్టువంటి కేసులలో ప్రతి రోజూ 400 నుంచి 500 వరకు మోటార్‌వెహికల్ ఆక్ట్ ప్రకారం నమోదు చేస్తున్నాం.

ప్రశ్న: డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదుచేస్తున్నారా..?

జ: డ్రంక్ అండ్ డ్రైవ్‌లు కేసులు నమోదు చేస్తున్నాం. ప్రజలలో అవగాహన ఇంకా పెరగాల్సిన అవసరం ఉంది. కూకట్‌పల్లి ట్రాఫిక్ పరిధిలో మూడు నుంచి నాలుగు పాయింట్లలో వారంలో రెండు రోజులు డ్రంక్ అండ్ డ్రైవ్ చెకింగ్‌లు చేస్తున్నాం. ఎవరైనా సరే మద్యం తాగి వాహనాలు నడపొద్దు.. నడిపి ప్రమాదాలు కొనితెచ్చుకోవద్దు.. ట్రాఫిక్ నిబంధనలు ఎవరైనా సరే పాటించాలి.

ప్రశ్న: రాంగ్‌రూట్ ప్రయాణాలు ఎక్కువగా ఎక్కడ జరుగుతున్నాయి...?

జ: రాంగ్‌రూట్ ప్రయాణాలపై ప్రత్యేక దృష్టి సారించాం. ముఖ్యంగా శివనంద పునరావాసకేంద్రం వద్ద బాలాజీనగర్‌వైపు వెళ్లేవారు అలాగే మూసాపేట మెట్రో సమీపంలో మూసాపేట వైపు వెళ్లేవారు ఈ రెండు చోట్ల రాంగ్ రూట్‌లో ప్రయాణాలు చేస్తున్నారు. ఇప్పటికే చాలా మందిపై కేసులు నమోదు చేశాం. రాంగ్‌రూట్ ప్రయాణం ఎంతో ప్రమాదకరం. ఎవరు కూడా రాంగ్‌రూట్‌లో ప్రయాణం చేయవద్దు.

ప్రశ్న: రోడ్లపైకి వాహనాలతో వస్తున్న మైనర్ల తల్లిదండ్రులకు మీరిచ్చే సూచనలు?

జ: ఇటీవల లైసెన్స్‌లు లేకుండా వాహనాలు నడపడం, త్రిబుల్ రైడింగ్‌లు.. మైనర్లు అతివేగంతో ప్రయాణం చేస్తున్న ఘటనలు ఎక్కువ చోటు చేసుకుంటున్నాయి. తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు. పిల్లల విషయంలో తల్లిదండ్రులే బాధ్యత వహించాల్సి వస్తుంది. వాహనం ఎవరి పేరు మీద ఉంటుందో వారే భాధ్యులు అవుతారు.

ప్రశ్న: రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యలేవీ..?

జ: రోడ్డు ప్రమాదాల నివారణకు మావంతు కృషిచేస్తున్నాం. వాహనం ద్వారా ప్రదాన కూడళ్లలో రోడ్డుప్రమాదాలపై అవగాన కల్పిస్తున్నాం. 2025 జనవరి మాసంలో సుమారు 60 చోట్ల పాఠశాలలు, కళాశాలలు, కాలనీలు, ఆటో, క్యాబ్, లారీ, ఆర్‌టీసీ డ్రైవర్లకు అవగాహన కల్పించాం. రోడ్డు ప్రమాదాలు కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించాం. ప్రజలు కూడా నిబంధనలు పాటించి క్షేమంగా ఇంటికి చేరుకోవాలి.

ప్రశ్న: నిబంధనల ఉల్లంఘనలపై నిఘా ఎలా ? పెంచుతున్నారు..?

జ: ట్రాఫిక్ ఉల్లంఘనులపై నిరంతరం నిఘా ఉంటుంది. కొన్ని పాయింట్‌లలో సిబ్బంది విధులు నిర్వహిస్తారు. ప్రయోగాత్మకంగా అధునాత సీసీ కెమరాలు కూడా వస్తున్నాయి. ఉల్లంఘనలు చేసేవారిని సీసీ కెమరా గుర్తించి వారి అడ్రస్‌కు చలాన్ పంపిస్తుంది. అది ఇంకా ప్రయోత్మక దశలో ఉంది. కూకట్‌పల్లి పరిధిలో ఒక సీసీ కెమరా ఇప్పటికే బిగించాం. లింక్ ఇంకా ఇవ్వాల్సి ఉంది.

ప్రశ్న: పెండింగ్ చలాన్‌ల విషయంలో ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు...?

జ: ట్రాఫిక్ వాహనాల చెకింగ్‌లో చలాన్ పెండింగ్ ఉన్న వాహనాలు గుర్తిస్తాం. సాధ్యమైన వరకు చలాన్‌లు పూర్తిగా కట్టించేందుకు ప్రయత్నం చేస్తాం. 8వరకు కేసులు ఉంటే 4 నుంచి 5 వరకైనా క్లియర్ చేపిస్తాం. కూకట్‌పల్లి ట్రాఫిక్ పరిధిలో నెలకు సుమారు రూ.8లక్షల నుంచి రూ.10లక్షల వరకు చలాన్‌లు కట్టిస్తాం. పెండింగ్ చలాన్ ఎప్పటికప్పుడే కట్టుకోవాలి.

ప్రశ్న: కూకట్‌పల్లి ప్రజలకు మీరిచ్చే సలహాలు, సూచనలు..?

జ: రోడ్డు మీదకు వచ్చే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి. క్షేమంగా ఇంటికి చేరుకోవాలి. ద్విచక్రవాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలి. కారులో ప్రయాణించేవారు తప్పక సీటు బెల్టు పెట్టుకోవాలి. ముఖ్యంగా వాహనాలు ఎవరికైనా ఇస్తే వారికి డ్రైవింగ్ లైసెన్స్ కలిగిఉన్నారా..లేదా చూసుకోవాలి. మైనర్ల విషయంలో తల్లిదండ్రులు వాహనాలను ఎట్టి పరిస్థితిలో కూడా ఇవ్వకూడదు.

ప్రమాదాలకు గల కారణాలు..

- రోడ్డు మూల మలుపుల వద్ద వేగంగా వెళ్లకుండా, జాగ్రత్తలు పాటించకపోవడం..
- కూడళ్లలో రెడ్‌సిగ్నల్ పడినా పట్టించుకోకుండా అతివేగంగా ప్రయాణం చేయడం..
- ఒక్క ద్విచక్రవాహనంపై ముగ్గురు ప్రయాణం చేస్తూ అదుపు తప్పడం...రోడ్లపై అతివేగంగా వెళ్లడం
- మద్యం మత్తు, నిర్లక్ష్యపు డ్రైవింగ్, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్..
- మైనర్లు, లైసెన్స్ లేని వారు వాహనాలు నడపడం
- సరైన నైపుణ్యం లేని డ్రైవింగ్ రహదారి భద్రతపై అవగాహన లేకపోవడం వంటి కారణాల్లో ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.


మజీద్ పెద్దలతో సీఐ నర్సింహరాజు

సీసీ కెమెరాల నిఘాతో నేరాల అదుపు

బాలానగర్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణకే సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నట్లు బాలానగర్ సీఐ నర్సింహ్మారాజు అన్నారు. సోమవారం బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గౌతమీనగర్ మజీద్ ఏ మహ్మదీయలో ఏర్పాటు చేసిన 10 సీసీ కెమెరాలు, మజీద్ ఆవరణలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్‌ను సీఐ ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలు తగ్గుతున్నాయన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో దొంగతనాలనికి పాల్పడే దొంగలు సైతం భయపడుతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రాంనారాయణ్, మజీదు పెద్దలు మకూదీఖ, సయ్యద్‌గౌస్, అజ్మీర్, ముజీబ్, అజీమ్, నజీర్‌ఖాన్, కైసర్, ఫిరోజ్, అహ్మద్ పాల్గొన్నారు.

'భరత్‌నగర్ కాలనీ' ఓటరు నమోదు

ఫతేనగర్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): భరత్‌నగర్ కాలనీ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఓటు నమోదు కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు భరత్‌నగర్‌కాలనీ సంక్షేమ సంఘం అడహక్ కమిటీ సభ్యులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం నుంచి వచ్చే నెల 10వ తేదీ వరకు ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. హెచ్ఐజీ, ఎంఐజీ, ఎల్ఐజీ, ఈడబ్ల్యూఎస్‌హౌసింగ్ బోర్డువారి వేలంలో ఇళ్లు కట్టిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు అన్నారు. అభ్యర్థులు సేల్‌డీడ్, మున్సిపల్ టాక్స్ బిల్లు, ఆధార్ జిరాక్స్, కరెంటుబిల్లు/వాటర్ బిల్లు వెంట తెచ్చుకోవాలని అన్నారు. వివరాల కోసం 9391623487 నెంబరుకు ఫోన్ చేయాలని వారు సూచించారు.

మాదకద్రవ్యాల నిర్మూలనలో భాగస్వామ్యం కావాలి

హైదరాబాద్ సిటీ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్, గంజాయి మాదకద్రవ్యాల నిర్మూలనలో ప్రతీ పౌరుడు భాగస్వామ్యం కావాలని రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీ.వై.ఎ.ఫ.ఐ), భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్.ఎఫ్.ఐ) ఆధ్వర్యంలో సంయుక్తంగా నిర్వహిస్తున్న షహిద్ భగత్‌సింగ్ స్మారక యువజనోత్సవాల పోస్టర్‌ను మంత్రి కార్యాలయంలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జూపల్లి మాట్లాడుతూ డ్రగ్స్ నిర్మూలన కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని, యువత చెడుఅలవాట్ల బారిన పడకుండా చైతన్యం చేయాలని అన్నారు. డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.డి.జావీద్ మాట్లాడుతూ యువజన ఉత్సవాల సందర్భంగా నగరంలో విస్తృతంగా సదస్సులు, క్రికెట్, చెస్, రన్, రక్తదాన శిబిరాలు, వ్యాసరచన పోటీలు, భగత్‌సింగ్ సందేశ్ ర్యాలీ, ముగింపు సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.


జలమండలి అధికారులతో చర్చిస్తున్న కార్పొరేటర్ రవీందర్ రెడ్డి

వేసవిలో తాగునీటి సమస్య తలెత్తవద్దు

బాలానగర్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి):వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా జలమండలి అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఉదయం కార్యాలయంలో జలమండలి అధికారులతో కలిసి నీటి ఎద్దడిపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఎండాకాలంలో నీటి డిమాండ్ ఎక్కువగా ఉంటుందని, నీటి సరఫరా వ్యవస్థలో ఏమైన లోపాలు ఉంటే వాటికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో బాలానగర్ సెక్షన్ జలమండలి మేనేజర్ అనిల్‌కుమార్, కూకట్‌పల్లి జలమండలి మేనేజర్ డి.సతీష్‌కుమార్, బాలానగర్ లైన్‌మెన్‌లు పాల్గొన్నారు.


టీచర్లను సత్కరిస్తున్న ఎంఈవో హరిచందర్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు

ఎంఈఓ ఆఫీస్‌లో మహిళా దినోత్సవం

బాలానగర్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని బాలానగర్ మండల విద్యాధికారి కార్యలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. మండల విద్యాధికారి హరిచందర్ ఆధ్వర్యంలో మండల పరిధిలో ఉన్న మహిళా హెచ్‌ఎంలు, మహిళా ఉపాధ్యాయులను శాలువాతో సత్కరించి, బొకేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కూకట్‌పల్లి రైతుబజార్‌లో ధరలు

కేపీహెచ్‌బీకాలనీ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి రైతుబజార్‌లో ధరలు ఇలా ఉన్నాయి. టమోట రూ.13, వంకాయ రూ.18, బెండకాయ రూ.50, పచ్చిమిర్చి రూ.45, బజ్జి మిర్చి రూ.23, కాకరకాయ రూ.45, బీరకాయ రూ.35, క్యాబేజీ రూ.10, బీన్స్ రూ.50, క్యారెట్ రూ.19, గోబిపువ్వు రూ.18, దొండకాయ రూ.50, చిక్కుడుకాయ రూ.50, గోరుచిక్కుడు రూ.40, బీట్‌రూట్ రూ.18, క్యాప్సికం రూ.31, ఆలుగడ్డ రూ.21, కీర రూ.18, దోసకాయ రూ.20, సొరకాయ రూ.15, పొట్లకాయ రూ.18, కంద రూ.55, ఉల్లిపొరక రూ.35, ఉల్లిగడ్డ రూ.34, మామిడి కాయ రూ.15-20, అరటికాయ రూ.8-9, చామగడ్డ రూ.55, ముల్లంగి రూ.4-5, చిలగడ దుంప రూ.35, గుమ్మడికాయ రూ.30, నిమ్మకాయలు రూ.50-60, మునగ కాయలు రూ.06-08, పచ్చిబఠాణి రూ.50, బొప్పాయి రూ.40, పుట్టగొడుగులు రూ.40, ఎండు మిర్చి రూ.160, అల్లం రూ.80, వెల్లుల్లి రూ.160, చింతపండు రూ.140, పండు మిర్చి రూ.80, ఉసిరి రూ.100, కరివేపాకు రూ.100, పర్వల్ రూ.60, పల్లికాయ రూ.60, లోబా రూ.25, ఆ కాకరకాయ రూ.60. పైన పేర్కొన్న ధరలు ఈరోజు ఉదయం 9.30 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

కూకట్‌పల్లి ఎస్‌హెచ్‌వో పి.రాజేష్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కేపీహెచ్‌బీకాలనీ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి ఎస్‌హెచ్‌వో ఎవరు? వెబ్‌సైట్‌లో ఒకరి పేరు.. స్టేషన్‌లో మరొకరి పేరు..! అనే శీర్షికతో ఈనెల 4న 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్‌తో సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ ఐటీ డిపార్ట్‌మెంట్ అధికారులు స్పందించి ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న పి.రాజేష్ పేరును వెబ్‌సైట్‌లో అప్‌డేట్ చేశారు. అలాగే ఎస్సై, ఇతరత్రా సమాచారం కూడా పొందుపర్చారు. ఎంతో కీలకమైన ఎస్‌హెచ్‌వో ఎవరో కూడా తెలియని పరిస్థితి నెలకొనడంతో ఫిర్యాదు దారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, పోలీస్ ఉన్నతాధికారుల నిర్లక్ష్యంపై 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితం కావడంతో అలర్ట్ అయ్యారని ఓ పోలీస్ అధికారి తెలిపారు. టెక్నాలజీని వాడుకుంటూ దొంగలను పటుకోవడం, సైబర్ నేరాలను ఛేదిస్తున్నామని చెప్పుకోవడం బాగానే ఉన్నా పోలీస్ స్టేషన్ కచ్చితమైన సమాచారం ప్రజలకు అందుబాటులో ఉంచకపోవడం గమనార్హం. కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ గురించి 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనాన్ని సీరియస్‌గా తీసుకున్న అధికారులు ఇతర స్టేషన్‌లలో పెండింగ్‌లో ఉన్న సమాచారాన్ని కూడా అప్‌డేట్ చేశారట. ఇలాంటి అంశాలపై మీడియా ఫోకస్ పెట్టడం మంచి విషయమని పీఎస్‌లో చర్చించుకున్నట్లు సమాచారం.

రోడ్డు ప్రమాదంలో గాయాలైన వ్యక్తి మృతి

హైదర్‌నగర్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన వ్యక్తి చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. ఈ సంఘటన కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఎల్లమ్మబండకు చెందిన పండ్ల వ్యాపారి మోహన్ టీవీఎస్ ఎక్సల్ వాహనంపై ఈనెల-9న కూకట్‌పల్లి నుంచి మియాపూర్ వెళ్తుండగా.. పిల్లర్ నంబర్ 740 వద్ద వేగంగా వచ్చిన ఆటో ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన క్షతగాత్రున్ని పోలీసులు స్థానికుల సహాయంతో అంబులెన్స్‌లో గాంధీకి తరలించారు. మోహన్ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి సోమవారం మృతి చెందాడు. అతని సోదరుడి ఫిర్యాదు మేరకు కేపీహెచ్‌బీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

కేపీహెచ్‌బీకాలనీ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): కేపీహెచ్‌బీ ఆరో ఫేజ్‌లోని విజయదుర్గా రామలింగేశ్వర స్వామివార్ల ఆలయ ప్రాంగణంలో ఈనెల 12న పంచముఖ అంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ చేస్తున్నారు. మంగళవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఉంటాయని, పురవీధుల్లో జరిగే ఊరేగింపులో భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని నిర్వాహకులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బుధవారం విగ్రహ ప్రతిష్ఠ అనంతరం మధ్యాహ్నం 12.30 గంటల నుంచి అన్న సమారాధన ఉంటుందని తెలిపారు.

సర్వే నెం.1లో ప్రభుత్వ స్థలం కబ్జా కానివ్వం

కాంగ్రెస్ పార్టీ కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేష్


స్థానికుల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తున్న బండి రమేష్

ఓల్డుబోయినపల్లి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఓల్డుబోయినపల్లి డివిజన్‌లో చెరువులు, ప్రభుత్వ స్థలాలను కబ్జా చేసిన వారు ఎంతటి వారైనా సరే వదిలిపెట్టబోమని కూకట్‌పల్లి ఇంచార్జి బండి రమేష్ అన్నారు. సోమవారం ఉదయం ఓల్డుబోయినపల్లి డివిజన్ టీపీసీసీ కార్యదర్శి దండుగుల యాదగిరి ఆధ్వర్యంలో సమస్యలపై ఆయన పాదయాత్ర చేశారు. డివిజన్ పరిధిలోని చిత్రిగడ్డ సర్వే నెంబర్-1లోని 108 ఎకరాల ప్రభుత్వ స్థలం కబ్జాకు గురైందని స్థానికుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో వాటి వివరాలు ఇవ్వాలని తహసీల్దార్, ఆర్డీవోకు సూచించారు. అనంతతరం బండి రమేష్ మాట్లాడుతూ అంజయ్యనగర్ బస్తీవాసులకు కమ్యూనిటీ హాల్, గొల్లకురుమలకు బీరప్పగుడి, కమ్యూనిటీహాల్, ముస్లింలకు కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. అనంతరం పెండింగ్‌లో ఉన్న మదర్సా భవనాన్ని ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు మల్లికార్జున్‌యాదవ్, సీనియర్ నాయకుడు నల్లోల్ల రాజెందర్, అస్లాం, షాహెన్, శ్రీరాములు, సందీప్, అశోక్, ఆనంద్, వెంకటేష్, అంజద్, ముస్తఫా, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదులంటే భవనాల సీజేనా?

ప్రజావాణిలో అధికారులను నిలదీసిన అల్లాపూర్ కార్పొరేటర్


జోనల్ కమిషనరు అపూర్వ చౌహాన్‌కు వినతి పత్రం ఇస్తున్న కార్పొరేటర్ సబీహ బేగం

అల్లాపూర్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ కూకట్‌పల్లి జోన్ జోనల్ కార్యలయంలో సోమవారం ప్రజావాణి వాడీవేడిగా జరిగింది. అల్లాపూర్ కార్పొరేటర్ సబీహబేగం అల్లాపూర్ డివిజన్‌లో నెలకొన్న వీధిదీపాల, సీసీరోడ్లు, కమ్యూనిటీ హాళ్ల అభివృద్ధికి సంబంధించిన ఫిర్యాదులను ఆయా కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులతో కలిసి జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సబీహబేగం..మాట్లాడుతూ.. ప్రజాఫిర్యాదులను స్వీకరిస్తున్న అధికారులు పక్షపాత వైఖరి అవలంబిస్తున్నారని ఆరోపించారు. అధికార పార్టీకి కొమ్ము కాస్తూ కేవలం కొందరు వ్యక్తులు భవన నిర్మాణాల మీద ఇస్తున్న ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకుని, వాటిని సీజ్ చేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బాబా జాహెద్ షరీఫ్, నాగుల సత్యం, జావీదుద్దీన్, బొల్లు శ్రీనివాస్ రావు, కొండం శ్రీనివాస్ రెడ్డి, అబ్దుల్ హమీద్, కందడి రామ్‌రెడ్డి, మల్లేశం, రాంబాబు, మధుసూదనా చారి, మాధవాచారి పాల్గొన్నారు.

స్వల్ప ఉద్రిక్తత

కేపీహెచ్‌బీకాలనీ: జీహెచ్ఎంసీ కూకట్‌పల్లి జోనల్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణిలో స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. ప్రజాసమస్యలు పట్టించుకోకుండా కార్పొరేటర్‌తో ఫిర్యాదుదారులను బయటే నిల్చోబెట్టడం పలువురు అధికారులపై కోపోద్రిక్తులయ్యారు. అదే సమయంలో అల్లాపూర్ కార్పొరేటర్ సబీహబేగం ప్రజావాణిలో జడ్సీతో సమావేశం కావడంతో నిజాంపేట్ కార్పొరేషన్ నుంచి వచ్చిన బీజేపీ నాయకులు ఆకుల సతీష్ తదితరులు అధికారుల తీరుపై అసహనం వ్యక్తంచేశారు. ప్రజావాణిలో ఇచ్చిన ఫిర్యాదులు కాగితాలకే పరమితం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలను బటయ ఉంచి కార్పొరేటర్‌తో సమావేశం ఏంటి? అని పలువురు ఆందోళన చేయడంతో జోనల్ ఏఎంసీ శ్రీకాంత్‌రెడ్డి వచ్చి సర్దిచెప్పారు. అందరూ జెడ్సీకి సమస్యలు చెప్పుకోవడానికి అవకాశం ఇస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు. మొత్తం 39 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. త్వరితగతిన పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు.



పికిల్ బాల్ కోర్టును ప్రారంభిస్తున్న శ్రీనివాస్

రాష్ట్రంలో పికిల్ బాల్‌ను ప్రోత్సహిస్తాం

హెచ్‌పీబీఏ అధ్యక్షుడు దుద్దిళ్ల శ్రీనివాస్ బాబు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): అమెరికా సహా ప్రపంచ వ్యాప్తంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న పికిల్ బాల్‌ను తెలంగాణలో కూడా ప్రోత్సహిస్తామని ఆ సంఘం హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు దుద్దిళ్ల శ్రీనివాస్ బాబు వెల్లడించారు. సోమవారం కొండాపూర్ బొటానికల్ గార్డెన్స్ సమీపంలోని పాడిల్ వేవ్ స్పోర్ట్స్ అకాడమీలో పికిల్ బాల్ కోర్టులను ఆయన ప్రారంభించారు. రాష్ట్ర పికిల్ బాల్ క్రీడాకారుల్లో ప్రతిభావంతులను గుర్తించి అంతర్జాతీయ స్థాయిలో వారు రాణించేలా కృషి చేస్తామని అన్నారు. రాష్ట్రంలో పికిల్ బాల్‌కు ఆదరణ పెంచేందుకు కసరత్తు చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో హైదరాబాద్ పికిల్ బాల్ సంఘం కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి, కోశాధికారి శ్రీధర్ పాల్గొన్నారు.



సీఎం సహాయనిధి మంజూరీ పత్రాలను బాధిత కుటుంబానికి అందజేస్తున్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరీ పత్రాల పంపిణీ

హైదర్‌నగర్, మార్చి10 (ఆంధ్రజ్యోతి): కొండాపూర్ శ్రీరామ్‌నగర్ కాలనీకి చెందిన మాలకొండయ్య ఆస్పత్రిలో చికిత్స పొంది, ఆ బిల్లుల కోసం సీఎం ఫండ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. దీంతో అతనికి మంజూరైన 2.50లక్షల విలువైన మంజూరి పత్రాలను అతని కుటుంబ సభ్యులకు సోమవారం ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రఘునాథ్‌రెడ్డి, గురుచరణ్‌దూబె, తదితరులు ఉన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

వివేకానందనగర్ డివిజన్ సప్తగిరి కాలనీలోని శ్రీకార్యసిద్ధి గణపతి, సుబ్రమణ్యస్వామి, జంటనాగ, నవగ్రహ, సహిత శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయంలో జరిగిన కల్యాణ మహోత్సవంలో ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో నాయకులు నాయినేని చంద్రకాంత్‌రావు, శ్రీనివాస్‌యాదవ్, మహేష్, ప్రవీణ్‌యాదవ్ పాల్గొన్నారు.



చెరువులో దోమల నివారణ మందు పిచికారిని పరిశీలిస్తున్న కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్

పటేల్‌చెరువులో దోమల మందు స్ప్రే

మియాపూర్, మార్చి10 (ఆంధ్రజ్యోతి): మియాపూర్ పటేల్‌చెరువులో జీహెచ్ఎంసీ ఎంటమాలజీ అధికారులతో కలిసి సోమవారం డ్రోన్‌సాయంతో దోమల నివారణ కోసం యాంటీలారా మందు పిచికారిని కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, పటేల్‌చెరువు చుట్టూ ఉన్న కాలనీల వాసులు దోమలతో ఇబ్బందులు పడుతున్నామని తన దృష్టికి తీసుకువచ్చారన్నారు. స్థానికంగా ఎటువంటి సమస్యలున్నా తన దృష్టికి తీసువస్తే వెంటనే పరిష్కరిస్తానని తెలిపారు.



పూజల్లో పాల్గొన్న భారతీనగర్ డివిజన్ కార్పొరేటర్ సింధూ ఆదర్శ్‌రెడ్డి

కామాక్షి అమ్మవారి ఆలయంలో బ్రహ్మోత్సవాలు

ఖేల్‌కాలనీ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): నిత్యపూజలందుకుంటున్న శ్రీ కామాక్షి అమ్మవారి దేవాలయ పుష్కర బ్రహ్మోత్సవాలు బీహెచ్‌ఈఎల్ టౌన్‌షిప్‌లో గల శ్రీ విరాట్ విశ్వకర్మ దేవాలయ ఆవరణలో గల కామాక్షి దేవి గుడిలో సోమవారం త్రయాహ్నిక దీక్షతో ప్రారంభమయ్యాయి. మూడురోజులపాటు విరాట్ విశ్వకర్మ దేవాలయం, పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం, కామాక్షి అమ్మవారి ఆలయాల్లో విశేషహోమాలు, ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ప్రభాతభేరి, సుప్రభాత ఉపనిషత్ పారాయణం, గోపూజ, ధ్వజారోహణ జరిగాయి. యాగశాలలో విశ్వకర్మ, కామాక్షి అమ్మవారి ఉత్సవ విగ్రహాలను ప్రతిష్ఠించి హోమాలను ప్రారంభించారు. మహాగణపతి పూజ, పంచగవ్య ప్రాసన, వాస్తుపూజ, వాస్తుహోమం, బ్రహ్మకలశస్థాపన, గణపతిహోమం, మూలమంత్ర హోమాలు నిర్వహించారు. ఉత్సవాల్లో భారతీనగర్ డివిజన్ కార్పొరేటర్ సింధూ ఆదర్శ్‌రెడ్డి పాల్గొని కామాక్షి అమ్మవారికి పూజలు చేశారు. దేవాలయ కమిటీ సభ్యులు మాయబ్రహ్మం, దేవేంద్రాచారి, కెవి.ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో అభిషేకాలు

ఖేల్‌కాలనీ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): బీహెచ్‌ఈఎల్ టౌన్‌షిప్‌లోని శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవాలయంలో పంచాహ్నిక దీక్షతో వారంరోజుల పాటు నిర్వహించే శ్రీమహాలక్ష్మీ హోమ ఉత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. నృసింహస్వామి ఆలయంలో ఉదయం నిత్య పూజలతో పాటు విశేష అభిషేకాలు అర్చనలు జరిగాయి. విష్ణు సహస్రనామ పారాయణం, విష్వక్సేన ఆరాధన, వాస్తుపూజ, మూలమూర్తులకు విశేషపూజలు నిర్వహించారు. కార్యనిర్వాహకులు భార్గవ్ ఆధ్వర్యంలో ప్రారంభమైన ఉత్సవాల్లో దేవాలయ కార్యవర్గ సభ్యులు, కార్మికులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో సమస్యలు పరిష్కరిస్తా : గౌతంగౌడ్



అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గౌతంగౌడ్

మియాపూర్, మార్చి10 (ఆంధ్రజ్యోతి): హఫీజ్‌పేట డివిజన్ పరిధిలోని సాయినగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రాన్ని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బాలింగ్ గౌతం గౌడ్ సోమవారం పరిశీలించారు. కేంద్రంలోని సమస్యను టీచర్ జ్యోతిని అడిగి తెలుసుకున్నారు. తన సొంత నిధులతో అంగన్‌వాడీ కేంద్రంలో సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంజుసాగర్, రెడ్డి, కామాజీ వెంకటేష్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, బాబుగౌడ్, రంజిత్, మహేష్, రాధాకృష్ణ పాల్గొన్నారు.

నిత్యం నరకయాతనే..!

- శేరిలింగంపల్లి నియోజకవర్గంలో నత్తనడకన అభివృద్ధి పనులు
- ఐదు నిమిషాల ప్రయాణానికి అరగంట రోడ్లపైనే వాహనాలు
- చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం



ఎదురెదురుగా వాహనాలు రావడంతో స్తంభించిన ట్రాఫిక్

మియాపూర్, మార్చి10 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనుల జాప్యం ట్రాఫిక్ సమస్యకు ప్రధాన కారణమవుతోంది. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో అనేక ప్రాంతాల్లో చేపట్టిన అభివృద్ధి పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. దీంతో అంతర్గత, ప్రధాన రహదారుల్లో వన్‌వే మాత్రమే ఓపెన్‌గా ఉండటం, మరోపక్క రహదారుల్లో అభివృద్ధి పనులు జరుగుతుండటంతో వాహన దారులు నిత్యం నరకయాతన పడుతున్నారు. దీంతో ప్రతి కాలనీలో లొల్లి మొదలవుతుంది. వన్‌వేలో వస్తున్న వాహనాలతో ఉదయం, సాయత్రం తీవ్ర ట్రాఫిక్ సమస్య నెలకొంటుంది. సమయానికి కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలలకు వెళ్లేందుకు పోటీపడుతుండటంతో వాహనదారుల మధ్య వాగ్వాదాలు చోటుచేసుకుంటున్నాయి. అడ్డదిడ్డంగా వాహనాలను నిలపడంతో కేవలం ఐదు నిమిషాల్లో వెళ్లాల్సిన ప్రయాణం 30నుంచి 40నిమిషాల సమయం పడుతుంది. దాదాపు 3నెలలుగా ఈ పరిస్థితి అనేక ప్రాంతాల్లో ఉన్నప్పటికీ అటు ట్రాఫిక్ సిబ్బంది కానీ, అభివృద్ధి పనులు చేపడుతున్న జీహెచ్ఎంసీ యంత్రాంగం కానీ, పనులు చేస్తున్న కాంట్రాక్టర్లు కానీ చొరవ తీసుకోక పోవడంతో నిత్యం వాహన దారులు నరకయాతన పడుతున్నారు. ప్రధానంగా హెచ్ఎంటీ స్వర్ణపురిలో రెండునెలలుగా రోడ్డు పనులు నత్తనడకన సాగడమే కాకుండా వన్‌వే చేయడంతో తీవ్ర ట్రాఫిక్ సమస్య నెలకొంటోంది. మియాపూర్ మదీనగూడ నుంచి బీహెచ్‌ఈఎల్ చౌరస్తా వరకు చేపట్టిన పైపులైన్ల నిర్మాణ జాప్యంతో ఇక్కడ తవ్వి పడేసిన మట్టికుప్పలు జాతీయ రహదారికి అడ్డుగా ఉండటంతో రోడ్డు ఇరుకుగా మారి ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది. ఏడాది కాలంగా మదీనగూడ మంజీర పైపులైను రోడ్డు హఫీజ్‌పేట వరకు నత్తనడకన సాగడమే కాకుండా ఇక్కడ కూడా వన్‌వే చేసి మీగత రహదారిని మూసివేశారు. దీంతో ఈ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్యతో వాహనాలు రోడ్లపై నిలిచిపోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బీహెచ్‌ఈఎల్ చౌరస్తాలో నూతనంగా చేపట్టిన ఫ్లైఓవర్ పనులు పూర్తయినపట్టికి ఈ ఫ్లైఓవర్‌కు ఇరువైపులా పనులు జరుగుతుండటంతో నిమిషాల వ్యవధి ప్రయాణానికి గంటల తరబడి పడుతుంది. మియాపూర్ ప్రశాంత్‌నగర్, కృషినగర్, జేపీఎన్‌నగర్‌లో కూడా అభివృద్ధి పనులతో ట్రాఫిక్ సమస్యకు కారణమౌతోంది. ఇప్పటికైనా ఈ ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో వేగం పెంచి పూర్తిచేసి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.



హెచ్ఎంటీ స్వర్ణపురిలో నత్తనడకన కొనసాగుతున్న రోడ్డు నిర్మాణ పనులు

కాలనీవాసుల అభ్యర్థన మేరకే డ్రైనేజీ లైన్లు

మియాపూర్, చందానగర్ పరిధిలోని కాలనీ రోడ్ల నిర్మాణం త్వరలోనే పూర్తిచేస్తాం. కాలనీవాసుల అభ్యర్థన మేరకు డ్రైనేజీ లైన్లు వేయడంతో ఆలస్యం జరిగింది. కొన్నిచోట్ల వాటర్ క్యూరింగ్ కోసం 21రోజులు ఆగడంతో ఇబ్బంది అవుతుంది. కొన్ని చోట్లా రోడ్లను ఓపెన్ చేయడం జరిగింది.

- డీఈ దుర్గప్రసాద్, చందానగర్ సర్కిల్

చెత్త రీసైక్లింగ్‌ను అడ్డుకోవద్దు

- రాంకీ సంస్థ తమ పొట్టకొట్టే పనులు చేస్తోంది
- ఆందోళనకు దిగిన చెత్త ఆటోరీక్షా కార్మికులు



జోనల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న చెత్త తరలించే ఆటో కార్మికులు

గచ్చిబౌలి, మార్చి10(ఆంధ్రజ్యోతి): సేకరించిన చెత్తను రీసైక్లింగ్ చేసుకునే అవకాశం లేకుండా రాంకీ సంస్థ తమ పొట్టకొట్టే పనులు చేస్తుందని తగిన న్యాయం చేయాలని కోరుతూ చెత్త ఆటో రీక్షా కార్మికులు జోనల్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. శేరిలింగంపల్లి జంటసర్కిళ్ల పరిధిలో సుమారు 600 ఆటోలు రీక్షాలు ఉన్నాయి. వీటిపై సుమారు 2వేల మంది ప్రత్యక్షంగా పనిచేస్తున్నారు. వీరు ఇంటింటికి వెళ్లి చెత్త సేకరించి మియాపూర్ దీప్తిశ్రీనగర్‌లోని యార్డులో చెత్త డంప్ చేస్తున్నారు. 20 సంవత్సరాలుగా ఈ ప్రక్రియ కొనసాగుతోంది. అయితే వారు తెచ్చిన చెత్తలో ప్లాస్టిక్, ఇనుము, చెత్తను వేరుచేసుకునే అవకాశం ఉండేది. ప్రస్తుతం రాంకీ సంస్థ సిబ్బంది కార్మికులను అడ్డుకుంటోంది. సేకరించిన చెత్తను నేరుగా డంపింగ్‌యార్డు మిషన్‌పై వేయాలని కార్మికులను ఆదేశిస్తుంది. అలా మిషన్‌లపై వేసే ఆటోలు మాత్రమే డంపింగ్ యార్డులోకి రావాలని, వేయని వాటిని యార్డులోకి రానివ్వమని ఆదేశాలు జారీ చేస్తున్నారు. దీంతో చెత్తకార్మికులు విషయాన్ని పలుమార్లు జీహెచ్ఎంసీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకపోయింది. దీంతో కార్మికులు పెద్దఎత్తున తరలివచ్చి జోనల్ కార్యాలయం ముందు నిరసన చేపట్టారు. అనంతరం కొంతమంది కార్మికులు జడ్‌సీ ఉపేందర్‌రెడ్డిని కలిసి తమ గోడువెళ్లబోసుకున్నారు. తాను స్వయంగా డంపింగ్ యార్డును సందర్శిస్తా, సిబ్బందితో జంట సర్కిళ్ల శానిటేషన్ అధికారులతో చర్చించి తగిన న్యాయం చేస్తానని జడ్‌సీ వారికి హామీ ఇవ్వడంతో వారు వెనుదిరిగారు.

ప్రజావాణికి ఫిర్యాదుల వెల్లువ



చందానగర్ మున్సిపల్ కమిషనర్‌కు కాలనీవాసుల ఫిర్యాదు



శేరిలింగంపల్లి సర్కిల్ కార్యాలయంలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఉపకమిషనర్ ముకుందారెడ్డి

చందానగర్, మార్చి10(ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలంటూ చందానగర్ సర్కిల్ మున్సిపల్ కమిషనర్ పి.మోహన్‌రెడ్డి అన్నారు. సర్కిల్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టౌన్‌ప్లానింగ్ విభాగానికి సంబంధించిన 1, రెవెన్యూ1, ఇంజనీరింగ్ 3, ఎలక్ట్రికల్ విభాగానికి సంబంధించిన ఫిర్యాదులు 1 అందాయని ఉప కమిషనర్ తెలిపారు. పార్కు స్థలాన్ని కబ్జా నుంచి కాపాడి అభివృద్ధి చేయాలని డిఫెన్స్ కాలనీ, ఫ్రెండ్స్ కాలనీ, అర్జున్‌రెడ్డి కాలనీకు చెందిన సంక్షేమ సంఘాల సభ్యులు ఉప కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. 6సంవత్సరాల క్రితం దొంగ డాక్యుమెంట్లతో ఎల్ఆర్ఎస్ తీసుకొని కబ్జాకు ప్రయత్నిస్తే కాలనీవాసులు అడ్డుకోగా, జీహెచ్ఎంసీ కబ్జాదారుల నిర్మాణాలను తొలగించి ఎల్ఆర్ఎస్‌ను రద్దు చేసిందని కసిరెడ్డి ఫిర్యాదులో పేర్కొన్నారు. ఉప కమిషనర్ స్థలాన్ని పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ నాగిరెడ్డి, ఏఎంహెచ్ఓ రవికుమార్, ఫ్రెండ్స్ కాలనీ అధ్యక్షుడు వెంకటేశం, డిఫెన్స్ కాలనీ అధ్యక్షుడు విఠల్‌రెడ్డి ఉన్నారు.

ఫిర్యాదులను పరిష్కరిస్తాం: ఉపకమిషనర్

గచ్చిబౌలి, మార్చి10(ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మంచి స్పందన లభించింది. ఉపకమిషనర్ ముకుందారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా దోమల నివారణ చర్యలు, అక్రమ నిర్మాణాలపై ఎక్కువ ఫిర్యాదులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. నాలాల పూడికతీత, రోడ్ల మరమ్మతులపై ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన సమస్యలను పరిష్కరిస్తున్నామన్నారు. అక్రమ నిర్మాణాలను ఉపేక్షించేది లేదని ఎంతటివారైన చర్యలు తీసుకుంటామన్నారు.

సావిత్రీబాయి పూలేను ఆదర్శంగా తీసుకోవాలి: సంజయ్‌కుమార్



సావిత్రీబాయి విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న భెల్ అధికారులు, ఉద్యోగులు

ఖేల్‌కాలనీ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మహిళలు అన్నిరంగాల్లో రాణించినప్పుడే మహిళా సాధికారిత సాధ్యమవుతుందని బీహెచ్‌ఈఎల్ ఓబీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఛైర్మన్ సంజయ్‌కుమార్ అన్నారు. సావిత్రీబాయి పూలే 128వ వర్ధంతిని భెల్ ఓబీసీ ఎంపాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భెల్ టౌన్‌షిప్‌లో గల అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించారు. మహాత్మా జ్యోతిరావ్, సావిత్రీబాయి పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతు కుటుంబంలో పుట్టి అంచలంచలుగా ఎదిగి భారతదేశంలో మొదటి ఉపాధ్యాయురాలిగా రాణించిన ఘనత సావిత్రీబాయికే దక్కిందన్నారు. ఆమెను ఆదర్శంగా తీసుకోవాలని, నేటి మహిళలు విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో నైపుణ్యాన్ని ప్రదర్శించాలన్నారు. మహిళా హక్కుల సాధనకోసం సావిత్రీబాయి సాగించిన పోరాటం ఫలితాలను నేటితరం అనుభవిస్తోందన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు రామ్‌రాజ్, ప్రధాన కార్యదర్శి నాగమోహన్, కమిటీ సభ్యులు గోపాల్, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలికి మాయమాటలు చెప్పి పుస్తెల తాడుతో పరారీ

12 గంటల్లో ఛేదించిన పోలీసులు



మాట్లాడుతున్న ఏసీపీ శ్రీనివాస్,

నిజాంపేట్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఓ వృద్ధురాలికి ఫోన్ చేసి మాటలు కలిపి ఆమె మెడలో ఉన్న రెండున్నర తులాల పుస్తెలతాడును లాక్కుని పరారైన వ్యక్తిని 12 గంటల వ్యవధిలో బాచుపల్లి పోలీసులు గుర్తించి అరెస్ట్ చేసి సోమవారం న్యాయమూర్తి ముందు ప్రవేశపెట్టారు. ఈ విషయమై బాలానగర్ డీసీపీ సురేష్‌కుమార్ పర్యవేక్షణలో ఏసీపీ శ్రీనివాస్, సీఐ ఉపేందర్, డీఐ యాదయ్యలతో సోమవారం బాచుపల్లి పోలీస్‌స్టేషన్‌లో విలేకర్ల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. ప్రవీణ్‌సాగర్ (30) నిజాంపేట రాజీవ్ గృహకల్ప ప్రాంతంలోని ప్రగతినగర్‌లో నివాసముంటూ స్విగ్గీ, జొమాటో, రియోలో డెలివరీ బాయ్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 8న రాత్రి పది గంటల సమయంలో రాజీవ్ గృహకల్పలో నివాసముంటున్న కెళ్ల బాలమ్మ(55) ఇంటికి వెళ్లి మీకు రియో నుంచి మీకు ఒక పార్సల్ వచ్చిందని అందజేశాడు. ఆమెతో మాటలు కలిపి తాను కూడా రాజీవ్ గృహకల్పలో నివసిస్తున్నానని మాటలు కలిపి ఆమె వద్దనున్న రెండున్నర తులాల పుస్తెలతాడును లాక్కుని పరారయ్యాడు. ఈ విషయంపై బాలమ్మ పోలీసులకు ఫిర్యాదు చేయగా సీఐ ఉపేందర్ పర్యవేక్షణలో క్రైం డీఐ యాదయ్య, సిబ్బందితో నిఘాపెట్టారు. 12 గంటల వ్యవధిలో అతడిని సీసీ కెమెరాల ద్వారా గుర్తించి బాచుపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారించగా నేరాన్ని అంగీకరించాడు. అతడి నుంచి పోలీసులు గొలుసును స్వాధీనం చేసుకున్నారు. ఆర్థిక సమస్య కారణంగా దొంగతనానికి పాల్పడినట్టు చెప్పాడని ఏసీపీ తెలిపారు. జ్యుడీషియల్ కస్టడీకి కోసం కోర్టులో హాజరుపరిచామని ఆయన తెలియచేశారు.



సదస్సులో మాట్లాడుతున్న టీజీఎస్ ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్

2026 నాటికి రూ.10 వేల కోట్ల టర్నోవర్

- టీజీఎస్ ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్

హైదరాబాద్ సిటీ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : వచ్చే ఏడాది 2026 నాటికి ఆర్టీసీ రూ. 10 వేల కోట్ల టర్నోవర్ చేరుకునే అవకాశముందని టీజీఎస్ ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ పేర్కొన్నారు. సోమవారం సోమవారం రెడ్‌హిల్స్‌లోని ఫెడరేషన్ హౌస్‌లో తెలంగాణ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఎఫ్‌టీసీసీఐ) ఆధ్వర్యంలో కార్పొరేట్ ఫెయిల్యూర్ అండ్ డిజిటల్ ఫ్రాడ్, విజయానికి మార్గాలపై సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న సజ్జనార్ మాట్లాడుతూ 2021 సెప్టెంబర్‌లో ఆర్టీసీ ఎండీగా బాధ్యతలు స్వీకరించినప్పుడు కార్పొరేషన్ మొత్తం టర్నోవర్ రూ.3800 కోట్లు కాగా, నాలుగేళ్లలో దాన్ని భారీగా పెంచి ఇప్పుడు ఇది బిలియన్ డాలర్ల కంపెనీగా మార్చినట్లు తెలిపారు. ఆర్టీసీ సంస్థలో పనిచేస్తున్న 50 వేలమంది ఉద్యోగుల నిబద్ధత, ధృఢ సంకల్పం, ప్రభుత్వ మద్దతుతో ఇది సాధ్యమైందన్నారు. ప్రస్తుతం ఏఐ, బిగ్ డేటా పెరుగుదల డిజిటల్ మోసాల పరిధిని పెంచిందన్నారు. డిజిటల్ మోసాలు నిరోధించడానికి సైబర్ సెక్యూరిటీపై సిబ్బందికి శిక్షణ ఇవ్వడం చాలా ముఖ్యమన్నారు. కార్యక్రమంలో సైబర్ సెక్యూరిటీ సొల్యూషన్స్ వ్యవస్థాపకుడు సాయిరామ్ పాలబిందెల, ఎఫ్‌టీసీసీఐ ఉపాధ్యక్షుడు ఆర్.రవికుమార్, కెకె.మహేశ్వరి, ఆఫీస్ బేరర్లు పాల్గొన్నారు.

నాకోసం వెతకొద్దు.. తనువు చాలిస్తున్నా..

- భర్తకు వీడియో కాల్ చేసిన భార్య
- రెండు రోజులుగా తీవ్రంగా గాలింపు
- నేటికీ దొరకని ఆచూకీ



ఉమారాణి

బాలానగర్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): 'నాకు క్యాన్సర్ ఉంది.. నేను కోలుకోలేను. మిమ్మల్ని ఇబ్బంది పెట్టదలుచుకోలేదు. అందుకే నేను కాశీకి వెళ్లి తనువు చాలించాలని అనుకుంటున్నాను. నాకోసం వెతక కండి. బాబును స్కూలు వద్ద దింపి వెళుతున్నా..' అంటూ భర్తకు సమాచారం ఇచ్చి ఓ ఇల్లాలు అదృశ్యమైంది. ఈ ఘటన బాలానగర్ పోలీస్ స్టేషన్‌లో ఆలస్యంగా వెలుగు చూసింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం నాడే ఈ ఘటన చోటుచేసుకున్నప్పటికీ ఈ కేసుకు సంబంధించిన వివరాలను పోలీసులు గోప్యంగా ఉంచారు. వివరాలిలా ఉన్నాయి. బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధి బాల్‌రెడ్డినగర్‌లో ధన్యాకుల రమేష్‌బాబు, ఉమారాణి (40) దంపతులు నివసిస్తున్నారు. వీరికి కుమారుడు ఉన్నాడు. కొంత కాలంగా ఉమారాణి క్యాన్సర్‌తో బాధపడుతున్నది. చికిత్స చేయించుకుంటున్నా నయం కావడం లేదనే మనోవ్యధతో ఆవేదన చెందుతుండేది. అయితే, భర్తను కష్టపెట్టవద్దని అంతర్జాతీయ మహిళా దినోత్సవం (మార్చి 8న) రోజున నిర్ణయం తీసుకుంది. బాబును స్కూలుకు తీసుకెళ్తున్నానని భర్తకు చెప్పి సెల్‌ఫోన్‌తో వెళ్లింది. డ్యూటీకి ఆలస్యం అవుతుండడంతో ఇంటికి తాళం వేసి భర్త ఆఫీసుకు వెళ్లిపోయాడు. అయితే, మధ్యాహ్నం 12.47 గంటలకు భర్తకు వీడియో కాల్ చేసి 'నా అనారోగ్యం కారణంగా మిమ్మల్ని ఇబ్బంది పెట్టొద్దని నిర్ణయించుకున్నాను. నేను తనువు చాలించాలనుకుంటున్నాను. కాశీకి వెళుతున్నా.. నాకోసం వెతకొద్దు..' అంటూ 3 నిముషాలు మాట్లాడి సెల్ స్విచ్ ఆఫ్ చేసింది. ఆ వెంటనే గాలించినా ఆమె ఆచూకీ తెలియకపోవడంతో రమేష్‌బాబు బాలానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కాశీకి వెళ్లి వచ్చిన పోలీసులు

ఉమారాణి ఫోన్ నెట్‌వర్క్ ఆధారంగా బాలానగర్ పోలీసులు కాశీకి వెళ్లారు. అక్కడి పోలీసులతో కలిసి ఆమె కోసం వెతుకున్నట్లు సమాచారం. అయితే, ఉమారాణి సెల్ నెట్‌వర్క్ చివరిసారిగా కాశీ చూపించినప్పటికీ ఎటువంటి అఘాయిత్యం చేసుకుని ఉండదని భావిస్తున్నారు. మరెక్కడికైనా వెళ్లిందేమోనని పోలీసులు అనుమానిస్తున్నారు.

మనస్తాపంతో యువతి ఆత్మహత్య



ప్రియాంక (ఫైల్)

పేట్‌బషీరాబాద్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): పరిశ్రమలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల మధ్య ఉన్న స్నేహం ప్రేమగా మారింది. పెళ్లి చేసుకుంటానని నమ్మించిన ప్రేమికుడి నయవంచనతో మోసపోయానని గుర్తించిన యువతి సోమవారం ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. పేట్‌బషీర్‌బాద్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గద్వాల్ జిల్లా ఇమామ్‌పూర్ గ్రామానికి చెందిన కండెల ప్రియాంక(27) ఎంబీఏ పూర్తిచేసి మూడేళ్ల క్రితం నగరానికి వలస వచ్చి కుత్బుల్లాపూర్‌లోని వసతిగృహంలో ఉంటోంది. తురకపల్లిలోని డైసిల్‌టెక్స్ నాలెడ్జి పరిశ్రమలో ఉద్యోగం చేస్తుంది. శ్రీకాకుళం జిల్లా బేగంపేట గ్రామానికి చెందిన రవికుమార్ పోస్టు గ్రాడ్యుయేషన్ పూర్తిచేసి ప్రియాంక చేస్తున్న పరిశ్రమలోనే విధులు నిర్వహిస్తున్నాడు. ఇదే క్రమంలో వారి పరిచయం కొన్నాళ్ళకు ప్రేమగా మారి, పెళ్లి వరకు వెళ్ళింది. అయితే ఆదివారం రాత్రి ప్రియంక రవికుమార్‌ను పెళ్లి చేసుకోవాలని నిలదీయగా అతడు నిరాకరించడంతో మనస్తాపానికి గురైన తను ఉంటున్న వసతి గృహంలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకొంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు.

జనసేన పార్టీ ఆవిర్భావ పోస్టర్ ఆవిష్కరణ

చందానగర్,మార్చి 10 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ 12వ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నామని ఆ పార్టీ శేరిలింగంపల్లి నియోజకవర్గం ఇన్‌చార్జ్ మాదవరెడ్డి అన్నారు. ఈ మేరకు చందానగర్‌లో సోమవారం పోస్టర్‌ను నాయకులతో కలిసి మాధవరెడ్డి ఆవిష్కరించారు.



సదస్సులో మాట్లాడుతున్న టీజీఎస్ ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్

2026 నాటికి రూ.10 వేల కోట్ల టర్నోవర్

● టీజీఎస్ ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్

హైదరాబాద్ సిటీ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : వచ్చే ఏడాది 2026 నాటికి ఆర్టీసీ రూ. 10 వేల కోట్ల టర్నోవర్ చేరుకునే అవకాశముందని టీజీఎస్ ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ పేర్కొన్నారు. సోమవారం సోమవారం రెడ్‌హిల్స్‌లోని ఫెడరేషన్ హౌస్‌లో తెలంగాణ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఎఫ్‌టీసీసీఐ) ఆధ్వర్యంలో కార్పొరేట్‌ఫెయిల్యూర్ అండ్ డిజిటల్ ఫ్రాడ్, విజయానికి మార్గాలపై సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న సజ్జనార్ మాట్లాడుతూ 2021 సెప్టెంబర్‌లో ఆర్టీసీ ఎండీగా బాధ్యతలు స్వీకరించినప్పుడు కార్పొరేషన్ మొత్తం టర్నోవర్ రూ.3800 కోట్లు కాగా, నాలుగేళ్లలో దాన్ని భారీగా పెంచి ఇప్పుడు ఇది బిలియన్ డాలర్ల కంపెనీగా మార్చినట్లు తెలిపారు. ఆర్టీసీ సంస్థలో పనిచేస్తున్న 50 వేలమంది ఉద్యోగుల నిబద్ధత, దృఢ సంకల్పం, ప్రభుత్వ మద్దతుతో ఇది సాధ్యమైందన్నారు. ప్రస్తుతం ఏఐ, బిగ్ డేటా పెరుగుదల డిజిటల్ మోసాల పరిధిని పెంచిందన్నారు. డిజిటల్ మోసాలు నిరోధించడానికి సైబర్ సెక్యూరిటీపై సిబ్బందికి శిక్షణ ఇవ్వడం చాలా ముఖ్యమన్నారు. కార్యక్రమంలో సైబర్ సెక్యూరిటీ సొల్యూషన్స్ వ్యవస్థాపకుడు సాయిరామ్ పాలబిందెల, ఎఫ్‌టీసీసీఐ ఉపాధ్యక్షుడు ఆర్.రవికుమార్, కెకె.మహేశ్వరి, ఆఫీస్ బేరర్లు పాల్గొన్నారు.

నా కోసం వెతకొద్దు.. తనువు చాలిస్తున్నా..

● భర్తకు వీడియో కాల్ చేసిన భార్య ● రెండు రోజులుగా తీవ్రంగా గాలింపు.. ● నేటికీ దొరకని ఆచూకీ


ఉమారాణి (ఫైల్)

బాలానగర్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): 'నాకు క్యాన్సర్ ఉంది.. నేను కోలుకోలేను. మిమ్మల్ని ఇబ్బంది పెట్ట దలుచుకోలేదు. అందుకే నేను కాశీకి వెళ్లి తనువు చాలించాలని అనుకుంటున్నాను. నా కోసం వెతకకండి. బాబును స్కూలు వద్ద దింపి వెళుతున్నా..' అంటూ భర్తకు సమాచారం ఇచ్చి ఓ ఇల్లాలు అదృశ్యమైంది. ఈ ఘటన బాలానగర్ పోలీస్ స్టేషన్‌లో ఆలస్యంగా వెలుగుచూసింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం నాడే ఈ ఘటన చోటుచేసుకున్నప్పటికీ ఈ కేసుకు సంబంధించిన వివరాలను పోలీసులు గోప్యంగా ఉంచారు. వివరాలిలా ఉన్నాయి. బాలానగర్ పోలీస్‌స్టేషన్ పరిధి బాల్‌రెడ్డినగర్‌లో ధన్యాకుల రమేష్ బాబు, ఉమారాణి(40) దంపతులు నివసిస్తున్నారు. వీరికి కుమారుడు ఉన్నాడు. కొంత కాలంగా ఉమారాణి క్యాన్సర్‌తో బాధపడుతున్నది. చికిత్స చేయించుకుంటున్నా నయం కావడం లేదనే మనోవ్యధతో ఆవేదన చెందుతుండేది. అయితే, భర్తను కష్టపెట్టవద్దని అంతర్జాతీయ మహిళా దినోత్సవం (మార్చి 8న) రోజున నిర్ణయం తీసుకుంది. బాబును స్కూలుకు తీసుకెళ్తున్నానని భర్తకు చెప్పి సెల్‌ఫోన్‌తో వెళ్లింది. డ్యూటీకి ఆలస్యం అవుతుండడంతో ఇంటికి తాళం వేసి భర్త ఆఫీసుకు వెళ్లిపోయాడు. అయితే, మధ్యాహ్నం 12.47 గంటలకు భర్తకు వీడియో కాల్ చేసి 'నా అనారోగ్యం కారణంగా మిమ్మల్ని ఇబ్బంది పెట్టొద్దని నిర్ణయించుకున్నాను. నేను తనువు చాలించాలనుకుంటున్నాను. కాశీకి వెళుతున్నా.. నా కోసం వెతకొద్దు..' అంటూ 3 నిముషాలు మాట్లాడి సెల్ స్విచ్ ఆఫ్ చేసింది. ఆ వెంటనే గాలించినా ఆమె ఆచూకీ తెలియకపోవడంతో రమేష్‌బాబు బాలానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కాశీకి వెళ్లి వచ్చిన పోలీసులు

ఉమారాణి ఫోన్ నెట్‌వర్క్ ఆధారంగా బాలానగర్ పోలీసులు కాశీకి వెళ్లారు. అక్కడి పోలీసులతో కలిసి ఆమె కోసం వెతికినట్లు సమాచారం. అయితే, ఉమారాణి సెల్ నెట్‌వర్క్ చివరిసారిగా కాశీ చూపించినప్పటికీ ఎటువంటి అఘాయిత్యం చేసుకుని ఉండదని భావిస్తున్నారు. మరెక్కడికైనా వెళ్లిందేమోనని పోలీసులు అనుమానిస్తున్నారు.


లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న కార్పొరేటర్లు జగన్, మంత్రి సత్యనారాయణ

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

కుత్బుల్లాపూర్, మార్చి 10(ఆంధ్రజ్యోతి) : కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాలకు చెందిన 57 మంది నిరుపేదలు అనారోగ్య సమస్యలతో వైద్య చికిత్సలు చేయించుకున్నారు. ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ను ఆశ్రయించారు. ఆయన ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి అబ్దిదారులకు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.21.46 లక్షల నిధులను మంజూరు చేయించారు.

సోమవారం చింతల్‌లోని క్యాంపు కార్యాలయంలో కార్పొరేటర్లు జగన్, మంత్రి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డిలు లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మహ్మద్ రఫీ, విజయరాంరెడ్డి, పోలె శ్రీకాంత్, కస్తూరి బాల్‌రాజు, గుబ్బ లక్ష్మీనారాయణ, కమలాకర్, నరేందర్‌రెడ్డి, సంపత్ మాధవరెడ్డి, సుధాకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి అయ్యప్ప దేవాలయ ప్రథమ వార్షికోత్సవాలు

కుత్బుల్లాపూర్/పేట్ బషీరాబాద్, మార్చి 10(ఆంధ్రజ్యోతి) : కుత్బుల్లాపూర్ సర్కిల్ జీడిమెట్ల డివిజన్ పరిధి శ్రీ రాఘవేంద్రకాలనీలోని అయ్యప్ప దేవాలయ ప్రథమ వార్షికోత్సవ వేడుకలు ఈ నెల 11 నుంచి 13వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు హాజరై స్వామివారి కృపకు పాత్రులుకాలగరని కోరారు.


అయప్ప దేవాలయం

కరాటేలో నిఖిల్, అనన్యకు రజతాలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో నిజాంపేట్‌కు చెందిన చిన్ని నిఖిల్ సాయి, అనన్య రజత పతకాలు సొంతం చేసుకున్నారు. గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరిగిన ఈ పోటీల్లోని అండర్-14 బాలుర విభాగంలో నిఖిల్ రజతం సాధించాడు. అండర్-9 బాలికల కేటగిరీలో అనన్య రజతంతో మెరిసింది. ఈ ఇరువురు నిజాంపేట్ ప్రగతి స్కూల్ విద్యార్థులు. కోచ్ వి.దుర్గాప్రసాద్ వద్ద వీరు శిక్షణ తీసుకుంటున్నారు.



పతకాలతో క్రీడాకారులు

మొండి బకాయిదారులకు రెడ్ నోటీసులు


గాజులరామారం సర్కిల్ డిప్యూటీ కమిషనర్


చింతల్ డివిజన్‌లో పన్నులు చెల్లించని హెచ్‌ఎంటీ పరిశ్రమ

కుత్బుల్లాపూర్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : నగర శివారులోని గాజులరామారం సర్కిల్ కార్యాలయం పరిధిలో పేరుకుపోయిన మొండి బకాయిదారులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. సంవత్సరాలుగా పన్నులు చెల్లించకపోవడమే కాకుండా వసూళ్ల కోసం వెళ్లిన అధికారులకు స్పందించకపోవడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటున్నారు. గాజులరామారం సర్కిల్ పరిధిలో గాజులరామారం, జగద్గిరిగుట్ట, చింతల్, సూరారం డివిజన్‌లుండగా సుమారు 45 వేల వరకు నివాసాలు, వ్యాపార సముదయాలు, చిన్న తరహా పరిశ్రమలున్నాయి. వీరందరిలో 10585 మంది ఇంకా పన్నులు చెల్లించడంలేదు. ప్రధానంగా ప్రభుత్వ కార్యాలయాలు, కేంద్ర ప్రభుత్వ సంస్థలు, పరిశ్రమల నిర్వాహకులే పన్నుల చెల్లింపుకు ముందుకు రావడంలేదు. అయితే పాత బకాయిలు ఎక్కువగా ఉండగా ఎక్కువ మొత్తంలో చెల్లించేది ఉండటంతో ప్రభుత్వం ఎరియర్స్‌గా ఉన్న నగదులో 90 శాతం రాయితీ కల్పించింది.

బకాయి పడ్డ బడా సంస్థలు

గాజులరామారం సర్కిల్ పరిధిలోని మొండి బకాయిదారుల్లో కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలైన హెచ్ఎంటీ, పోస్టాఫీస్, బీఎస్ఎన్ఎల్‌తో పాటు ఇతర నిర్మాణదారులున్నారు. హెచ్ఎంటీ పరిశ్రమ నిర్వాహకులు ప్రభుత్వానికి సుమారుగా రూ.7కోట్ల బకాయి ఉంది. అయితే రాయితీ కల్పించడంతో రూ.4.64 కోట్లు తగ్గగా రూ.2.30 కోట్లు చెల్లించాల్సి ఉంది. కానీ ముందుకు రాకపోవడంతో సోమవారం రెడ్ నోటీసులు జారీ చేశారు. అదేవిధంగా విద్యుత్ సబ్‌స్టేషన్‌కు సంబంధించిన రూ.1.5 కోట్ల పన్ను చెల్లించాలి. కానీ అంత చెల్లించలేమని టీజీఎస్‌పీడీసీఎల్ ప్రభుత్వానికి అర్జీ పెట్టడంతో ఆర్డర్ ఇచ్చినట్లు సమాచారం. బీఎస్ఎన్ఎల్ వారు రూ.1.93 కోట్లకు పన్ను చెల్లింపుకు గాను రూ. 1.02 కోట్ల రాయితీ కల్పించింది. అయినా పూర్తిగా చెల్లించేందుకు ముందుకు రావడంలేదని తెలుస్తోంది.


Notice of Demand
Acknowledgement
Locality : C.I.E Gandhi Nagar
The Details of Property Tax Dues
HYDERABAD

హెచ్‌ఎంటీ పరిశ్రమకు అందజేసిన రెడ్ నోటీసు

కఠిన చర్యలు తప్పవు



గాజులరామారం సర్కిల్ పరిధిలో పది వేలకు పైగా సంస్థలు, నివాసాలకు సంబంధించిన పన్నులు మొండి బకాయిలుగా పేరుకుపోయాయి. ప్రభుత్వం వన్ టైం సెటిల్‌మెంట్‌లో భాగంగా 90 శాతం రాయితీ కల్పించడంతో ఇప్పటివరకు 130 మంది రూ.14.01 లక్షలను చెల్లించారు. మిగతావారు ఈ ఆర్థిక సంవత్సరం పూర్తయ్యే లోపు చెల్లించాలి. పన్నులు చెల్లించని వారికి రెడ్ నోటీసులు జారీ చేస్తున్నాం. అయినప్పటికీ చెల్లించకుంటే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కఠిన చర్యలు తప్పవు.

- మల్లారెడ్డి,
డిప్యూటీ కమిషనర్, గాజులరామారం సర్కిల్

ఎక్కడ చూసినా కబ్జాలే!

● ప్రజావాణిలో సీపీఐ నేతల ఫిర్యాదు


అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

నిజాంపేట్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రభుత్వ స్థలాల కబ్జాలు, అక్రమ నిర్మాణాలు, అక్రమ షెడ్లను అరికట్టేవిధంగా చర్యలు తీసుకోవాలని బాచుపల్లి మండల సీపీఐ కార్యదర్శి పాలబిందెల శ్రీనివాస్ మేడ్చల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణిలో అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్‌లో ఎక్కడ చూసినా ప్రభుత్వ స్థలాల కబ్జాలే దర్శనమిస్తున్నాయని, కబ్జాలను నిరోధించడంలో రెవిన్యూ అధికారులు పూర్తిగా విఫలమయ్యారని అన్నారు. ప్రజలకు ఉపయోగపడే కమ్యూనిటీ హాల్స్, పార్కులు, గ్రంథాలయాలను ఏర్పాటు చేయడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని అదనపు కలెక్టర్‌కు వివరించారు. నిజాంపేట సర్వే నంబర్ 90, 94 నుంచి రాజధాని స్కూల్ వరకు వెళ్లే దారిలో విశాలమైన రహదారి ప్రస్తుతం కబ్జాకు గురైందని, దీనివల్ల ఉదయం సాయంత్రం ట్రాఫిక్ సమస్య జఠిలంగా మారిందని అన్నారు. ఈ విషయంపై ఫిర్యాదు చేస్తే టౌన్ ప్లానింగ్ అధికారులు ఆ నిర్మాణాలను తొలగించారు, మరలా యథాస్థాయిలో నిర్మాణాలు వెలిశాయని, ఇప్పుడు ఫిర్యాదు చేస్తే ఏమాత్రం పట్టించుకోవడంలేదన్నారు. కబ్జాలు, నిర్మాణాలను అరికట్టి ప్రభుత్వ భూములను కాపాడే విషయంలో శ్రద్ధ తీసుకోవాలని అదనపు కలెక్టర్‌ను కోరామని తెలిపారు. ఫిర్యాదు చేసిన వారిలో జిల్లా పార్టీ సహాయ కార్యదర్శి దామోదర్‌రెడ్డి, కౌన్సిల్ సభ్యులు ఈశ్వర్, యాదయ్య, కుమార్ ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఫిర్యాదు

కుత్బుల్లాపూర్, మార్చి 10(ఆంధ్రజ్యోతి) : కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్లలో సోమవారం జరిగిన ప్రజావాణిలో సమస్యలను పరిష్కరించాలని పలువురు ఫిర్యాదు చేశారు. గాజులరామారం సర్కిల్ పరిధిలో ఇంజనీరింగ్‌కు 5, టౌన్‌ప్లానింగ్‌కు 2, ఉద్యానవనాలకు సంబంధించిన ఒక ఫిర్యాదు వచ్చినట్లు డీసీ మల్లారెడ్డి తెలిపారు. కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలో టౌన్ ప్లానింగ్‌కు 3, పారిశుధ్య విభాగానికి 1, ఇంజనీరింగ్ విభాగానికి ఒక ఫిర్యాదు వచ్చిందని డీసీ తెలియజేశారు. వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి సాధ్యమైనంత త్వరలోనే పరిష్కరిస్తామన్నారు.

తాగునీరు అందించేందుకు కృషి

పేట్‌బషీరాబాద్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ప్రజలకు తాగునీరును సక్రమంగా అందించేందుకు కృషిచేయాలని సీజీఎం నారాయణ అన్నారు. రంగారెడ్డినగర్ డివిజన్‌లోని ఏపీహెచ్‌బీ కాలనీలోని జలమండలి కార్యాలయంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో జీఎం అశోక్‌తో కలిసి ఆయన ప్రజలు అందించిన వినతి పత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచినీటి పైపులైన్ల మరమ్మత్తుల వల్ల నీటి సరఫరాకు అంతరాయం వాటిల్లుతుందని, త్వరలోనే సమస్య పరిష్కారం అవుతుందని అన్నారు. ప్రజావాణిలో 9 ఫిర్యాదులు అందినట్లు జీఎం తెలిపారు. ఈ కార్యక్రమంలో జలమండలి డిజిఎంలు, మేనేజర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకుంటుంది

● మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

పేట్‌బషీరాబాద్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకుంటుందని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. కొంపల్లి పురపాలక సంఘంలో గత నెల 30న అపర్ణకాలనీ, నూజివీడు తదితర ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు డ్రైనేజీ, రోడ్లు లేక ఇబ్బందులు పడుతున్నారని ఆయన దృష్టికి తీసుకెళ్ళగా స్పందించిన ఆయన 40 రోజుల్లోనే హెచ్ఎండీఏ నుంచి నూతన రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారు. ఈ సందర్భంగా కాలనీలవాసులు సోమవారం కృతజ్ఞత సభను ఏర్పాటుచేశారు. ఈ సభకు ఆయన హాజరై ప్రసంగించారు. ముఖ్యమంత్రి నాయకత్వంలో ప్రజాపాలన, ప్రజాసంక్షేమానికి పనిచేస్తుందని అన్నారు. కార్యక్రమంలో పురపాలక సంఘం కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు బైరి ప్రశాంత్‌గౌడ్, కొంపల్లి మాజీ సర్పంచ్ జిమ్మి దేవేందర్, నాయకులు శివకుమార్‌గౌడ్, సుదర్శన్‌రెడ్డి, గోపాల్ రెడ్డి, మోహన్‌రెడ్డి, కృష్ణ, గోపాల్, అంజి తదితరులు పాల్గొన్నారు.


హెచ్ఎండీఏ డీఈతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

మరో కార్యక్రమంలో..

కొంపల్లి పురపాలక సంఘంలోని ఈద్గా పునరుద్ధరణకు సహకరించాలని మైనారిటీ నాయకులు మాజీ ఎమ్మెల్యేను కోరారు. దీంతో త్వరలోనే సమస్యను పరిష్కరిస్తానని రంజాన్ పండుగ రోజు ప్రార్థనలు చేసుకొనేలా కృషిచేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో షేక్ ఇబ్రహీం, చాంద్‌బాషా, ఖదీర్, మహ్మద్, మదర్ పాల్గొన్నారు.


దరువు లలితమ్మకు నివాళులర్పిస్తున్న మందకృష్ణ మాదిగ

దరువు లలితమ్మకు నివాళులర్పించిన నాయకులు

గాజులరామారం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : ప్రజా వాగ్గేయకారుడు, ఉద్యమనేత దరువు అంజన్న తల్లి లలితమ్మ ఇటీవల అకాల మరణం చెందారు. గాజులరామారం డివిజన్ ద్వారకానగర్‌లో జరిగిన లలితమ్మ దశదిన కర్మకు ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షులు, పద్మశ్రీ మందకృష్ణ మాదిగ, బీసీ సంక్షేమసంఘం జాతీయ అధ్యక్షులు శ్రీనివాస్‌గౌడ్, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డిలు హాజరై ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

జర్నలిస్టుల సంక్షేమానికి సహకారం

జీడిమెట్ల, మార్చి 10(ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల సంక్షేమానికి తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని జీడిమెట్ల సీఐ గడ్డం మల్లేష్ అన్నారు. మూడు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శర్మ అనే టీవీ రిపోర్టర్‌ను సోమవారం ఆయన పరామర్శించారు. రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే ఆసుపత్రి యాజమాన్యంతో చర్చించి మెరుగైన వైద్యం అందించాలని మల్లేష్ కోరారు. ఈ సందర్భంగా పలువురు జర్నలిస్టులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. జర్నలిస్టులు విధి నిర్వహణలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గుంతలను పూడ్చించిన అధికారులు


మ్యాన్‌హోల్స్‌కు మరమ్మతులు చేసిన దృశ్యం

కుత్బుల్లాపూర్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : కుత్బుల్లాపూర్ సర్కిల్ చెరుకుపల్లి కాలనీ పోచమ్మ దేవాలయం సమీపంలో డ్రైనేజీ మ్యాన్ హోల్స్ తవ్వించి మరమ్మతులు చేయకపోవడంతో 'మరమ్మతులు చేయించాలి' అనే శీర్షికన సోమవారం ప్రచురితమైన కథనానికి జలమండలి అధికారులు స్పందించారు. సిబ్బంది మ్యాన్‌హోల్స్‌కు మరమ్మతులు చేసి గుంతలను పూడ్చారు. సమస్యను పరిష్కరించేందుకు కృషి చేసిన 'ఆంధ్రజ్యోతి'కి స్థానికులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.


తెరుచుకున్న రేషన్ దుకాణాలు

కుత్బుల్లాపూర్, మార్చి 10(ఆంధ్రజ్యోతి) : కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని మాణిక్యనగర్, పద్మానగర్ ఫేజ్-1లలో సమయానికి రేషన్ దుకాణాలు తెరవడంలేదు. డీలర్ల నిర్లక్ష్యం.. అందని రేషన్ అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈ విషయమై సంబంధిత దుకాణదారులకు ఆదేశాలివ్వడంతో సోమవారం సమయానికి తెరిచారు. సమయానికి రేషన్ సరుకులు అందేలా కృషి చేసిన 'ఆంధ్రజ్యోతి'కి పేదలు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.


మాణిక్యనగర్‌లో తెరుచుకున్న రేషన్ దుకాణం

మరమ్మతులు చేసిన అధికారులు

షాపూర్‌నగర్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ప్రమాదకరంగా విద్యుత్ తీగలకు మరమ్మతులు చేయాలని 'ఆంధ్రజ్యోతి'లో సోమవారం వెలువడిన కథనానికి అధికారులు స్పందించారు. హెచ్ఏఎల్‌కాలనీ రోడ్డు నంబర్ ఐదులో తెగిన విద్యుత్ వైరుకు విద్యుత్ సిబ్బంది సోమవారం మరమ్మతులు నిర్వహించారు. ఎలాంటి ప్రమాదం జరుగకముందే అధికారులు స్పందించి మరమ్మతులు చేయడంతో స్థానికులు ఊపిరి పీల్చుకొన్నారు.


విద్యుత్ తీగలకు మరమ్మతులు చేస్తున్న విద్యుత్ సిబ్బంది

క్రైమ్ సమాచారం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ శ్రీనివాస్

మాయమాటలు చెప్పి పుస్తెల తాడుతో పరారీ

● 12 గంటల్లో కేసును ఛేదించిన పోలీసులు

నిజాంపేట్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : ఓ వృద్ధురాలి మెడలో ఉన్న రెండున్నర తులాల పుస్తెలతాడును లాక్కుని పరారైన వ్యక్తిని 12 గంటల వ్యవధిలో బాచుపల్లి పోలీసులు గుర్తించి అరెస్ట్ చేసి సోమవారం న్యాయమూర్తి ముందు ప్రవేశపెట్టారు. బాలానగర్ డీసీపీ సురేష్‌కుమార్ పర్యవేక్షణలో ఏసీపీ శ్రీనివాస్, సీఐ ఉపేందర్, డీఐ యాదయ్యలతో సోమవారం బాచుపల్లి పోలీస్‌స్టేషన్‌లో విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ప్రవీణ్‌సాగర్(30) నిజాంపేట రాజీవ్ గృహకల్ప ప్రాంతంలోని ప్రగతినగర్‌లో నివాసముంటూ స్విగ్గీ, జొమాటో, రియోలో డెలివరీ బాయ్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 8న రాత్రి పది గంటల సమయంలో రాజీవ్ గృహకల్పలో నివాసముంటున్న కెళ్ల బాలమ్మ(55) ఇంటికి వెళ్లి మీకు రియో నుంచి ఒక పార్సల్ వచ్చిందని అందజేశాడు. ఆమెతో మాటలు కలిపి తాను కూడా రాజీవ్ గృహకల్పలో నివసిస్తున్నానని మాటలు చెబుతూ ఆమె వద్దనున్న రెండున్నర తులాల పుస్తెలతాడును లాక్కుని పరారయ్యాడు. ఈ విషయంపై బాలమ్మ పోలీసులకు ఫిర్యాదు చేయగా సీఐ ఉపేందర్ పర్యవేక్షణలో క్రైం డీఐ యాదయ్య, సిబ్బందితో నిఘా పెట్టారు. 12 గంటల వ్యవధిలో అతడిని సీసీ కెమెరాల ద్వారా గుర్తించి బాచుపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారించగా నేరాన్ని అంగీకరించాడు. అతడి నుంచి గొలుసును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆర్థిక సమస్య కారణంగా దొంగతనానికి పాల్పడినట్టు చెప్పాడని ఏసీపీ శ్రీనివాస్ తెలిపారు. కేసు నమోదు చేసి జ్యుడీషియల్ కస్టడీకి కోసం కోర్టులో హాజరుపరిచామని ఆయన తెలియచేశారు. కేసును కేవలం 12 గంటల్లోనే గుర్తించి చాకచక్యంగా వ్యవహరించిన క్రైం పోలీసులు అంజయ్య, శ్రీనివాస్, రాజు, ఎం.కనకయ్యలకు ఏసీపీ రివార్డును అందజేసి అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి


ప్రభిత డాలీ (ఫైల్)

పేట్ బషీరాబాద్, మార్చి 10(ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై మహేశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. అసోం దేమాజి జిల్లాకు చెందిన ప్రభిత డాలీ(28) ఉపాధి కోసం నగర శివారులోని దేవరయాంజాల్‌కు వలస వచ్చి స్థానికంగా గల డబ్ల్యూఏఎల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌లో సూపర్‌వైజర్‌గా పని చేస్తూ, అక్కడే నివాసముంటున్నాడు. ఈ నెల 2వ తేదీ సాయంత్రం పరిశ్రమ నుంచి మల్లన్నకాలనీలో ఉంటున్న స్నేహితుడిని కలువడానికి వెళ్లాడు. అదే రోజు రాత్రి స్నేహితుడి ద్విచక్రవాహనంపై తిరిగి పరిశ్రమకు వస్తుండగా మార్గమధ్యంలో సాయి గీతాశ్రమం వద్ద బైక్ అదుపుతప్పి కిందపడటంతో తలకు గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు పోలీసులకు, స్నేహితుడికి సమాచారం అందించడంతో వారు ఘటన స్థలానికి చేరుకుని సుచిత్ర సమీపంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు. చికిత్స పొందుతున్న ప్రభిత డాలీ ఆదివారం రాత్రి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

మనస్తాపంతో యువతి ఆత్మహత్య


ప్రియాంక (ఫైల్)

పేట్‌బషీరాబాద్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల మధ్య ఉన్న స్నేహం ప్రేమగా మారింది. పెళ్ళి చేసుకుంటానని నమ్మించిన ప్రేమికుడి నయవంచనతో మోసపోయానని గుర్తించిన యువతి సోమవారం ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. పేట్‌బషీర్‌బాద్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గద్వాల్ జిల్లా ఇమామ్‌పూర్ గ్రామానికి చెందిన కండెల ప్రియాంక(27) ఎంబీఏ పూర్తిచేసి గత మూడు సంవత్సరాల క్రితం నగరానికి వలస వచ్చి కుత్బుల్లాపూర్‌లోని వెన్నెలగడ్డ శ్రీధనలక్ష్మి వసతిగృహంలో ఉంటోంది. తురకపల్లిలోని డైసిల్‌టెక్స్ నాలెడ్జి పరిశ్రమలో ఉద్యోగం చేస్తుంది. శ్రీకాకుళం జిల్లా బేగంపేట గ్రామానికి చెందిన రవికుమార్ పోస్టు గ్రాడ్యుయేషన్ పూర్తిచేసి ఉపాధి నిమిత్తం నగరానికి వలస వచ్చి సుభాష్‌నగర్‌లో ఉంటూ ప్రియాంక చేస్తున్న పరిశ్రమలోనే విధులు నిర్వహిస్తున్నాడు. ఇదే క్రమంలో వారి పరిచయం కొన్నాళ్ళకు ప్రేమగా మారి, పెళ్లి వరకు వెళ్ళింది. ప్రియంక ఆదివారం రాత్రి రవికుమార్‌ను పెళ్లి చేసుకోవాలని నిలదీయగా అతడు నిరాకరించడంతో మనస్తాపానికి గురై వసతి గృహంలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు.

వృద్ధుడు అదృశ్యం


మన్మధరెడ్డి(ఫైల్)

గాజులరామారం, మార్చి 10(ఆంధ్రజ్యోతి) : ఇంటి నుంచి బయటకు వెళ్లిన వృద్ధుడు అదృశ్యమయ్యాడు. సూరారం సీఐ భరత్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. సూరారం శ్రీరాంనగర్ కాలనీ వెంకటప్రగతి రెసిడెన్సీకి చెందిన శేఖర్‌రెడ్డి తండ్రి మన్మధరెడ్డి(60) ఈ నెల 8న సాయంత్రం భోజనం చేసి పడుకున్నాడు. శనివారం ఉదయం చూసేసరికి అతడు ఇంటిలో కన్పించలేదు. ఉదయం వాకింగ్‌కు వెళ్లాడని కుటుంబ సభ్యులు అనుకున్నారు. ఎంతకీ రాకపోవడంతో చుట్టుపక్కల తెలిసిన వారు, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో కొడుకు సోమవారం సూరారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రామలింగేశ్వరస్వామి ఆలయంలో చోరీ

జీడిమెట్ల, మార్చి 10(ఆంధ్రజ్యోతి): జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని గాంధీనగర్ శ్రీరామలింగేశ్వరస్వామి దేవాలయంలో సోమవారం తెల్లవారుజామున గుర్తు తెలియని ఇద్దరు దొంగలు చోరీకి పాల్పడ్డారు. గుడి తలుపులు పగులగొట్టి లోపలికి చొరబడి నాగపడిగ, హారతిపళ్లెం, అయ్యప్పస్వామి పంచలోహ విగ్రహం, నీటిధార పాత్ర, పూజ వస్తువులు దొంగిలించుకు పోయారు. భక్తులు సోమవారం ఉదయం ఆలయంలో చోరీ జరిగినట్టు గుర్తించి జీడిమెట్ల పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. త్వరలోనే నిందితులను పట్టుకుంటామని జీడిమెట్ల సీఐ గడ్డం మల్లేష్ పేర్కొన్నారు.